సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



ఆస్తి పన్నులో రికార్డు

ఆస్తి పన్ను వసూలులో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ రికార్డు సాధించింది. తొలిసారి రూ.5 కోట్ల మార్కును దాటింది.

8లో ▸



ఆమనగల్లు: ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



మొయినాబాద్: ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

❖ భక్తిశ్రద్ధలతో ఈదుల్ ఫితర్

ఈదుల్ ఫితర్ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనాలు చేసుకొని 'ఈద్ ముబారక్' చెప్పుకొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



షాద్‌నగర్: ఈద్గా వద్ద చిన్నారులు

న్యూస్‌రీల్

రోడ్డు నిర్మాణానికి జాయింట్ సర్వే



సర్వే నంబర్లను పరిశీలిస్తున్న అధికారులు

తుర్కయంజాల్: సాగర్ రహదారి నుంచి తొర్రూర్ స్కూప్స్ ఐస్‌క్రీమ్ కంపెనీ వరకు హెచ్‌ఎండీఏ వేయనున్న 60 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి సోమవారం రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించారు. ఎస్‌ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్ సమీపంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం కమాన్ నుంచి సాయిప్రియ లే అవుట్‌లోని హైటెన్షన్ లైన్ కింద నుంచి రోడ్డు వేయాలని భావిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పలు ఇళ్ల నిర్మాణాలు పూర్తయి, వాటిల్లో అనేక మంది నివసిస్తున్నారు. ఇలాంటి సమయంలో ఒక్కసారిగా రోడ్డు నిర్మాణం అంటూ అధికారులు సర్వే నిర్వహిస్తుండటం ఇళ్ల నిర్మాణదారుల్లో గుబులు రేపుతోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనూ ఎన్నికలకు ముందు ఇదే రోడ్డు నిర్మాణానికి పలుమార్లు అధికారులు పరిశీలన చేశారు. అయినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. తాజాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి సర్వే నిర్వహించారు. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న నిర్మాణాలు, ప్లాట్లు, పొలాల గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంత్ రెడ్డి, తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, హెచ్‌ఎండీఏ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శైలజ, మండల సర్వేయర్ జ్యోతి పాల్గొన్నారు.

శ్వాస మీద ధ్యాస పెట్టి ధ్యానం చేయాలి



బ్రహ్మర్షి ప్రేమ్‌నాథ్‌గుప్తాతో ధ్యానులు

ఇబ్రహీంపట్నం: శక్తి ఉన్నచోట వైరసులు సోకవని బ్రహ్మర్షి ఎం.ప్రేమ్‌నాథ్‌గుప్తా అన్నారు. ఇబ్రహీంపట్నంలోని జై హనుమాన్ ధ్యాన కేంద్రంలో సోమవారం ప్రత్యేక మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ధ్యానులను ఉద్దేశించి మాట్లాడారు. దేహనికి ఆరోగ్యం, మనస్సుకు శాంతి, బుద్ధికి ఆలోచన, ఆత్మకు శక్తి, సర్వాత్మకు ముక్తి అవసరమన్నారు. అందుకు సాధన ముఖ్యమని తెలిపారు. శ్వాస మీద ధ్యాస పెట్టి ధ్యానం చేయడం ద్వారా మన సంకల్పాలు, ఆశయాలు సిద్ధించడమేగాక మనలో ఒక శక్తి ఉద్భవిస్తుందన్నారు. పత్రీజీ చూపిన మార్గంలో పయనించి ముక్తి పొందాలని సూచించారు.

నేటి నుంచే 'ఎర్లీబర్డ్'

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో కొత్త ఆర్థిక సంవత్సరం (2025–26) మొదటి నెల (ఏప్రిల్)లోనే ఆస్తిపన్ను మొత్తం చెల్లించే వారికి 5 శాతం రాయితీ వర్తించే 'ఎర్లీబర్డ్' పథకం మంగళవారం నుంచే అమల్లోకి వస్తుంది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆస్తిపన్ను పాతబకాయిలు లేనివారికి, 2025–26 ఆర్థిక సంవత్సరం మొత్తం ఆస్తిపన్ను ఒకే దఫా చెల్లించేవారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది. ఇది కేవలం కొత్త ఆర్థిక సంవత్సరానికి మాత్రమే. పాత బకాయిదారులకు ఈ రాయితీ వర్తించదని జీహెచ్‌ఎంసీ స్పష్టం చేసింది. ఏప్రిల్ 30వ తేదీ వరకు 'ఎర్లీబర్డ్ 'కింద 5 శాతం రాయితీతో ఆస్తిపన్ను చెల్లించవచ్చు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



బుచ్చయ్యగౌడ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

మంచాల: తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన ఘటన మండలంలోని ఆరుట్లలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పాశం బుచ్చయ్యగౌడ్ (65) గీత కార్మికుడు. ఎప్పటిలాగే సోమవారం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు మోకు జారిపోవడంతో కిందపడి తీవ్ర గాయాలై అక్కడికక్కడే చనిపోయాడు. ఇతనికి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు. పలువురు నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

నీళ్లు.. ఏవీ ఆనవాళ్లు?

పడిపోతున్న జలమట్టం

- ఫిబ్రవరితో పోలిస్తే మార్చిలో మరింత తగ్గుముఖం
- వట్టిపోతున్న బోరుబావులు
- ఎండిపోతున్న పంటలు
- తాగునీటికి తప్పని కటకట

సాక్షి, రంగారెడ్డిజిల్లా: శేరిలింగంపల్లిలో ఫిబ్రవరి చివరి నాటికి 15.07 మీటర్ల లోతులో కన్పించిన నీటి ఆనవాళ్లు.. మార్చి చివరి నాటికి 23.12 మీటర్ల కిందికి పడిపోయాయి. కేవలం నెల రోజుల వ్యవధిలోనే 8.05 మీటర్ల లోతుకు భూగర్భజల మట్టం పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. గృహ, వాణిజ్య అవసరాల కోసం ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. బస్తీవాసుల బలహీనతను ట్యాంకర్ల యజమానులు 'క్యాష్' చేసుకుంటున్నారు. మినీ ట్యాంకర్(ట్రాక్టర్)కు రూ.1000, పెద్ద ట్యాంకర్ (డీసీఎం, లారీ)కు రూ.2,500 పైగా వసూలు చేస్తున్నారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ సహా మూసీ పరీవాహక ప్రాంతాల్లో బోర్లు వేసి యథేచ్ఛగా నీటి విక్రయాలు చేపడుతున్నారు. నగరానికి ఆనుకుని ఉన్న శేరిలింగంపల్లి, సరూర్‌నగర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం మండలాల్లోనే కాదు.. శివారు మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. చేవెళ్లలో నెల రోజుల క్రితం 10.83 మీటర్ల లోతు నుంచి 12.00 మీటర్లలోతుకు, షాబాద్‌లో 12.01 మీటర్ల నుంచి 14.59 మీటర్లకు, తలకొండపల్లిలో 13.52 నుంచి 15.47 మీటర్ల లోతుకు జలమట్టం పడిపోయింది. మంచాల సహా యాచారం, మాడ్గుల, తలకొండపల్లి, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లో పంటలు ఎండిపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు ట్యాంకర్లపై నీటిని తరలిస్తున్న దృశ్యాలు జిల్లాలో విరివిగా కన్పిస్తుండటాన్ని పరిశీలిస్తే.. మున్ముందు మరింత నీటి సంక్షోభం తప్పదనే సంకేతాలు వ్యక్తమవుతున్నాయి.



ఆమనగల్లు: చింతలపల్లిలో ఎండిన వరిపొలం

మంచాలలో కరువు ఛాయలు

నగరం శరవేగంగా విస్తరిస్తోంది. ఒకప్పటి శివారు ప్రాంతాలన్నీ ప్రస్తుతం నగరంలో అంతర్భాగమయ్యాయి. పంట భూములన్నీ రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారాయి. చెరువులు, కుంటలు దాదాపు కనుమరగయ్యాయి. ఒకటి రెండు ఉన్నా..వాటి చుట్టూ భారీ నిర్మాణాలు, సీసీ రోడ్లతో పూర్తిగా కాంక్రీట్ జంగిల్‌గా మారింది. ప్రతి 25 నుంచి 50 ఫీట్ల దూరంలో ఒక బోరు బావిని తవ్వుతుండటం, సెప్టెంబర్/అక్టోబర్ నెలల్లో భారీ వర్షాలు కురిసినప్పటికీ.. భూమిలోకి నీరు ఇంకకపోవడం, చెరువులు, కుంటల్లో ఉన్న కొద్దిపాటి నీరు కూడా లేకపోవడంతో భూగర్భంలోని నీరు పాతాళానికి పడిపోయింది. జనవరి చివర్లో కొంత ఆశాజనకంగా ఉన్న భూగర్భ జలాలు ఏప్రిల్ ప్రారంభం నాటికే పూర్తిగా కన్పించకుండా పోవడం ఆందోళన కలిగిస్తోంది. ఆకుపచ్చని పైరు.. నీరు లేక ఎండిపోతుండటంతో రైతులు తమ పంటలను పశువుల మేతకు వదిలేస్తున్నారు. కొంత మంది రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని తరలించి పంట చేలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మంచాల మండలం తిప్పాయిగూడలో ఇప్పటికే పంటలన్నీ పూర్తిగా ఎండిపోయాయి. తాగేందుకు కూడా గుక్కెడు నీరు దొరకని పరి స్థితి. ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ ఇప్పటి వరకు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.



యాచారం: ఆశతో బోరు మోటారుకు మరమ్మతులు

పరుపుల కంపెనీలో అగ్ని ప్రమాదం

- వ్యాపించిన దట్టమైన పొగలు
- రంజాన్ వేళ భయకంపితులైన స్థానికులు
- మంటలు అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది



కంపెనీ నుంచి వెలువడుతున్నపొగ

పహాడీషరీఫ్: ఓ పరుపుల తయారీ కంపెనీలో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జనావాసాల నడుమ చోటు చేసుకున్న ఈ ప్రమాదంతో రంజాన్ వేళ స్థానికులు భయకంపితులయ్యారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. జల్‌పల్లి గ్రామంలోని ప్రధాన రహదారిపై ఉన్న ఖాజా బేకరీ గల్లీలో చార్మినార్ ప్రాంతానికి చెందిన మహమూద్ కొన్నాళ్లుగా పరుపుల తయారీ పరిశ్రమను నిర్వహిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు వ్యాపించి పరుపులకు అంటుకున్నాయి. చూస్తుండగానే దట్టమైన పొగలు రావడంతో అందులో ఉన్న సిబ్బంది ప్రాణభయంతో బయటికి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పహాడీషరీఫ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ప్రమాదం జరిగిన గోడౌన్‌లో సిలిండర్ ఉండడం.. చుట్టూ నివాసాలు ఉండడంతో తమకు ఎలాంటి ముప్పు వాటిల్లుతుందోనని స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. దాదాపు 50 నిమిషాల తర్వాత అక్కడికి చేరుకున్న ఫైరింజన్ మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. ఫైర్ సిబ్బంది సిలిండర్‌ను బయటికి తేవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందనందున కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

'ఫ్యూచర్' బాస్ ఎవరు?

- త్వరలోనే ఫ్యూచర్ సిటీ అథారిటీకి కమిషనర్ నియామకం
- యంగ్ అండ్ డైనమిక్ ఐఏఎస్ అధికారికి పగ్గాలు
- యువ ఐఏఎస్‌లు శశాంక, హరీశ్, గోపి పేర్ల పరిశీలన
- ఇప్పటికే అథారిటీ కోసం 90 పోస్టులకు గ్రీన్ సిగ్నల్



హరీశ్



గోపి



శశాంక

సాక్షి, రంగారెడ్డి జిల్లా: సీఎం రేవంత్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో కీలకమైన అడుగు పడనుంది. ఈ మేరకు ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ)కి కమిషనర్‌ను నియమించనున్నారు. చురుకైన యువ ఐఏఎస్ అధికారిని ప్రాజెక్ట్ సారథిగా నియమిస్తే బాగుంటుందనే భావనలో సీఎం రేవంత్ ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రతిపాదిస్తున్న ఫోర్త్ సిటీని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ఎఫ్‌సీడీఏ పరిధిని ప్రత్యేకంగా భావిస్తోంది. ప్రపంచ ప్రఖ్యాత ఐటీ, ఫార్మా, క్రీడారంగాలకు ప్రాధాన్యతనిస్తున్న సర్కారు.. ఆ మేరకు జోన్లను కూడా నిర్దేశిస్తోంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటున్న ప్రభుత్వ పెద్దలు అంతర్జాతీయ నగరాలపై అవగాహన ఉన్న అధికారులకు దీని పాలనాపగ్గాలు కట్టబెట్టే దిశగా ఆలోచన చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే.. గతంలో కలెక్టర్లుగా వ్యవహరించిన కె.శశాంక (2013), డాక్టర్ ఎస్.హరీశ్ (2015) పేర్లను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ ప్రాంతంపై వీరికి స్పష్టమైన అవగాహన ఉండడం కలిసొచ్చే అంశం. గోపి (2016) పేరును సైతం పరిశీలించి త్వరలోనే తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశముంది.

ఫోర్త్ సిటీ అభివృద్ధే లక్ష్యం

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత గ్రేటర్‌లో ఫోర్త్ సిటీ అవసరం ఉందని సీఎం నిర్ణయించారు. 765.28 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఫోర్త్ సిటీని అభివృద్ధి చేయాలన్నది సర్కార్ లక్ష్యం. మహేశ్వరం, ఆమన్‌గల్లు, కడ్తాల్, కందుకూరు, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల తదితర ఏడు మండలాల్లోని 56 గ్రామాలు ఎఫ్‌సీడీఏ పరిధిలోకి వస్తాయి. ఇప్పటికే ఎఫ్‌సీడీఏ కోసం కొత్తగా 90 పోస్టులకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది వీటిలో 34 రెగ్యులర్ పోస్టులు కాగా.. మిగిలిన 56 పోస్టులను ఔట్ సోర్సింగ్/కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేస్తారు. ఎఫ్‌సీడీఏ కమిషనర్ నియామకం పూర్తవగానే ఫ్యూచర్ సిటీ నిర్మాణం మరింత వేగం పుంజుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

నాలుగేళ్లలో కార్యరూపం

ఇప్పటికే ఫోర్త్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం ప్రారంభంకాగా పనులు చకచకా సాగుతున్నాయి. ఉగాది తర్వాత ఆర్టిఫిషీయల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇదే సమయంలో ఫ్యూచర్ సిటీకి అన్ని ప్రాంతాల నుంచి అనుసంధానం చేసేందుకు గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్ల నిర్మాణానికి సైతం ప్రణాళికలు సిద్ధమయ్యాయి. మరోవైపు ఫ్యూచర్ సిటీలో పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను సైతం వేగవంతం చేసింది. వచ్చే నాలుగేళ్లలో ఫ్యూచర్ సిటీకి ఓ రూపం తీసుకువచ్చేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తోంది.



నక్కర్తమేడిపల్లిలో టీజీఐఐసీ వేసిన ఫెన్సింగ్ లోపల వరి సాగు

ఇక సాగు వద్దు

ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో పంటలు ఆపేయండి

- రైతులకు అధికారుల సూచన
- రెండు, మూడు రోజుల్లో మరోసారి సర్వే
- పక్కాగా హద్దుల గుర్తింపునకు నిర్ణయం

యాచారం: ఫార్మాసిటీ పేరుతో సేకరించిన అసైన్డ్, పట్టా భూముల్లో సాగు చేయడం ఇక ఆపేయాలని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. భూసేకరణ నిబంధనలు అతిక్రమించొద్దని చెబుతున్నారు. గత బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో ఫార్మాసిటీ పేరుతో యాచారం, కందకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని పది గ్రామాల్లో 19,333 ఎకరాల అసైన్డ్, పట్టా భూమిని సేకరించడానికి నిర్ణయించడం తెలిసిందే. 2017 నుంచి భూసేకరణ ప్రక్రియ ప్రారంభించి 2022 వరకు 14 వేల ఎకరాలు సేకరించారు. అప్పట్లో రైతులకు పరిహారం అందజేసి సేకరించిన భూముల చుట్టూ టీజీఐఐసీ ఇనుప కంచె ఏర్పాటు చేసింది. బోర్డులు పాతి, కంచె ఏర్పాటు చేసినప్పటికీ రైతులు మాత్రం యథావిధిగా పంటలు సాగు చేస్తున్నారు. ఐదారేళ్లుగా వరి, పత్తి, కంది, పండ్లతోటలు, పలు రకాల కూరగాయలు సాగు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

సర్వేనంబర్ల వారీగా..

ఫార్మాసిటీకి సేకరించిన యాచారం, కందుకూరు మండలాల్లోని ఆయా గ్రామాల్లో అసైన్డ్, పట్టా భూముల సర్వేనంబర్ల వారీగా రెండు, మూడు రోజుల్లో మళ్లీ సర్వే చేయనున్నారు. ఇబ్రహీంపట్నం, కందుకూరు ఆర్డీఓల పర్యవేక్షణలో టీజీఐఐసీ, సర్వే, పోలీస్ అధికారులు సేకరించిన సర్వేనంబర్ల వారీగా సర్వే చేసి పక్కాగా హద్దులు గుర్తించనున్నారు. ఒక్కో సర్వే నంబర్‌లో భూమి మొత్తం ఎంత, సేకరించింది ఎంత అనేది తేల్చనున్నారు. భూసేకరణ నోటిఫికేషన్, అవార్డు ప్రకటన రికార్డులను వెంట తీసుకెళ్లి సేకరించిన భూమిలో నిజమైన రైతులకే పరిహారం అందిందా అనే వివరాలు తెలుసుకోనున్నారు. యాచారం మండలం నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామా ల్లోని అసైన్డ్ భూముల్లో వందలాది మంది నకిలీలకు రూ. కోట్లాది పరిహారం అందినట్లు ఆరోపణలు ఉన్నాయి. రైతుల సమక్షంలోనే సర్వే చేస్తే నిజాలు వెలుగులోకి వస్తాయనేది అధికారుల అభిప్రాయం.

ఫ్యూచర్‌సిటీకి భూముల అప్పగింత

ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన రేవంత్‌రెడ్డి సర్కార్ అదే భూముల్లో ఫ్యూచర్ సిటీని నిర్మించాలని నిర్ణయించడం తెలిసిందే. ఫార్మాసిటీకి సేకరించిన 14 వేల ఎకరాలకు పైగా భూముల్లో ఫ్యూచర్‌సిటీ నిర్మాణం చేపట్టనుంది. ఏఐసీటీ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు అత్యాధునిక వాణిజ్య భవనం సహా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్, క్రికెట్ స్టేడియం తదితర ప్రపంచ ప్రఖ్యాత సంస్థలకు ఇందులో చోటు కల్పించనున్నారు. ఇప్పటికే వివిధ ప్రముఖ సంస్థలతో ఒప్పందం చేసుకున్న సర్కార్ ఆ సంస్థలకు ఇక్కడ కావాల్సిన భూములను అప్పగించనుంది. భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే మరోసారి రెవెన్యూ, టీజీఐఐసీ అధికారుల పర్యవేక్షణలో సర్వే చేయాలని, హద్దులు, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆయా సంస్థలకు భూములను అప్పగించాలని భావిస్తోంది.

పక్కాగా సర్వే



ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో సాగు ఆపేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. పరిహారం ఇచ్చి సేకరించిన అసైన్డ్, పట్టా భూములను మళ్లీ సర్వే చేసి పక్కాగా గుర్తిస్తాం. టీజీఐఐసీ, రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో భూములను పరిశీలించి సర్వే ఆధారంగా హద్దులు గుర్తించి, ఫెన్సింగ్ వేస్తాం. పరిహారం పొందిన భూములనే తీసుకుంటున్న దృష్ట్యా రైతులు సహకరించాలి.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

పార్టీ బలోపేతానికి ఐక్యంగా పనిచేయాలి



మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీజేపీ నాయకుల

- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి
- బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు కుమార్, శివ, శివకుమార్, రాజు, అనిల్, పవన్, మల్లేశ్, మధావచారితో పాటు మరో 15 మంది బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ఐక్యంగా పనిచేయాలన్నారు. విభేదాలకు తావులేకుండా పార్టీ పటిష్టత, స్థానిక సంస్థలన్నింటిలో విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. పార్టీ పటిష్టతకు పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుదన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అర్హులందరికీ రేషన్ కార్డులు వస్తాయని, అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్‌లు లింగం, జనార్దన్‌రెడ్డి, ఖాజామియా, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌నాయక్, మహేందర్‌గౌడ్, నాయకులు రవీందర్‌యాదవ్, సుభాష్‌రెడ్డి, మాధవరెడ్డి, మల్లారెడ్డి, బురాన్ దస్తగిరి, సత్యం, శేఖర్, రాఘవేందర్, చేవెళ్ల స్వామి, తదితరులు పాల్గొన్నారు.

టీవీ రంగయ్యకు ఉగాది పురస్కారం

షాద్‌నగర్: నగరంలోని అమీర్‌పేట కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అక్కినేని నాగేశ్వర్‌రావు శతజయంతి సందర్భంగా ఆంధ్ర నాటక కళాపరిషత్ 96వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విశ్వావసునామ సంవత్సర ఉగాది వేడుకలో కళారంగానికి అత్యుత్తమ సేవలను అందిస్తున్న పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు టీవీ రంగయ్యను ఉగాది పురస్కారంతో సన్మానించారు. కిమ్స్ ఆస్పత్రి అధినేత బొల్లినేని కృష్ణయ్య, కమ్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేక రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అన్నమనేని ప్రసాద్ చేతుల మీదుగా ఆయన ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం టీవీ రంగయ్య మాట్లాడుతూ.. ఆంధ్ర నాటక కళాపరిషత్‌లో ఏఎన్ఆర్, ఎన్టీఆర్ లాంటి ఎందరో ప్రముఖ నటులు ప్రదర్శనలు ఇచ్చారని అన్నారు. అలాంటి సంస్థ తన సేవలను గుర్తించి పురస్కారాన్ని అందించడం ఆనందంగా ఉందన్నారు. పురస్కారానికి ఎంపిక చేసిన పెద్దలకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా కళాభిమానులు రంగనాథం, బెజుగం రమేష్, వడ్ల రమేష్‌చారి, సింగారం శ్రీనివాస్, నారాయణచారి, మల్లికార్జునగౌడ, సత్యనారాయణ, బాలబ్రహ్మాచారి, సుధాకర్ తదితరులు ఆయన్ను అభినందించారు.



పురస్కారం అందుకుంటున్న టీవీ రంగయ్య

జల్‌పల్లిలో ఏటీఎం పాక్షిక ధ్వంసం

పహాడీషరీఫ్: ఏటీఎం సెంటర్‌లోకి చొరబడిన ఓ వ్యక్తి మిషన్‌ను ధ్వంసం చేశాడు. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదివారం రాత్రి జల్‌పల్లి శ్రీరాం కాలనీలోని ఐసీఐసీఐ ఏటీఎంలోకి వెళ్లిన ఓ వ్యక్తి మిషన్‌ను ధ్వంసం చేసేందుకు యత్నించాడు. సోమవారం ఉదయం ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, ఏటీఎం స్వల్పంగా ధ్వంసమైనట్లు నిర్ధారించారు. సాంకేతిక ఆధారాలను పరిశీలించిన అనంతరం మానసిక స్థితి సరిగా లేని ఓ వ్యక్తి ఇందుకు కారణమని తేల్చారు. అతన్ని అదుపులోకి తీసుకుని, అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని వెల్లడించారు.

హయత్‌నగర్‌లో అగ్ని ప్రమాదం

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్‌లోని ఓ స్క్రాప్ దుకాణంలో సోమవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పీఅండ్‌టీ కాలనీలోని దుర్గా ప్లాస్టిక్ స్క్రాప్ దుకాణంలో నిప్పంటుకుని మంటలు ఎగిసి పడుతుండటాన్ని గుర్తించిన స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది రెండు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్: కారు ఢీ కొనడంతో రోడ్డు దాటుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కొంపల్లి గార్డెన్ హౌసింగ్ సొసైటీకి చెందిన మహేంద్ర చౌదరి(34) ఆదివారం రాత్రి తన బంధువు లాలు చౌదరితో కలిసి సరుకులు కొనుగోలు చేసేందుకు కొంపల్లికి వచ్చాడు. అనంతరం కొంపల్లి సినీ ప్లానెట్ వద్ద రోడ్డు దాటుతుండగా మేడ్చల్ నుంచి సుచిత్ర వైపు వెళుతున్న ఫార్చునర్ కారు అతడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి పన్ను వసూలులో 'పట్నం' రికార్డు

- రూ.5 కోట్లు రాబట్టిన ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ

ఇబ్రహీంపట్నం: ఆస్తి పన్ను వసూలులో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ తొలిసారి రికార్డు సాధించింది. రూ.5 కోట్ల మార్కును దాటి ఔరా అనిపించింది. గ్రామ పంచాయతీ నుంచి 2013లో నగర పంచాయతీగా, 2018 మున్సిపాలిటీగా ఇబ్రహీంపట్నం ఆవిర్భవించిన సంగతి తెలిసిందే. అయితే పట్టణం శరవేగంగా విస్తరిస్తున్నప్పటికీ.. తగిన ఆదాయం సమకూరడంలేదు. అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా పన్ను వసూలులో వెనుకబడింది. ఈ సారి అధికార యంత్రాంగం పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించింది. స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టి అనుకూల ఫలితాలను సాధించింది.

పాత బకాయి రూ.7 కోట్లు

ప్రైవేట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించి సుమారు 7,239 భవనాల నుంచి ఆస్తి పన్నులు వసూలు కావాల్సి ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరం వసూలు లక్ష్యం రూ.11.50 కోట్లు కాగా, అందులో రూ.7 కోట్లు పాత బకాయే ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఏడు 3,933 భవన యజమానుల నుంచి రూ.4 కోట్లు, 1,300 భవన యజమానుల నుంచి పాత బకాయి రూ.1.30 కోట్లను పుర అధికారులు రాబట్టగలిగారు. 2023– 24 ఆర్థిక సంవత్సరంలో రూ.4.42 కోట్లు, 2022– 23లో రూ.4.06 కోట్లు, 2021– 22లో రూ.3.21 కోట్లను వసూలు చేయగా.. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు రోజైన మార్చి 31 నాటికి రూ.5 కోట్ల 30 లక్షలు వసూలు చేశారు.



ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

లక్ష్యం చేరుకున్నాం



ప్రత్యేక దృష్టితో గడిచిన ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను వసూలు లక్ష్యం నెరవేర్చాం. రూ.5.30 కోట్లు వసూలు చేసి రికార్డు సాధించాం. సుమారు రూ.11.50 కోట్ల టార్గెట్‌లో రూ.7 కోట్లు పాత బకాయి ఉంది. అందులో ప్రభుత్వ సంస్థల బకాయే రూ.2.50 కోట్లు. ఈ సారి పాత బకాయి ఉన్న 1300 భవనాల యాజమానుల నుంచి రూ.1.30 కోట్లు వసూలు చేశాం. పాత బకాయి చెల్లించకుండా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పన్ను తీసుకునే వీలుండదు. పేరుకుపోయిన బకాయిలన్నింటిని వసూలు చేయలేకపోయాం. – రవీంద్రసాగర్, కమిషనర్, ఇబ్రహీంపట్నం

కోడి పందేల స్థావరంపై దాడులు

కుత్బుల్లాపూర్: కోడి పందాలు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి నగదు, కోడి కత్తులను స్వాధీనం చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. దేవరయాంజాల్‌లోని ఈటల రాజేందర్ ఫామ్‌హౌస్ సమీపంలో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సోమవారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి తోటలో కోడి పందాలు నిర్వహిస్తున్న తొమ్మిది మంది వ్యక్తులు పోలీసులను గుర్తించి పరారయ్యేందుకు ప్రయత్నించారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి రూ.26,940 నగదు, రెండు కోళ్లు, 15 కోడి కత్తులు, ఏడు మొబైల్ ఫోన్లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులోఉంది.

ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పెంచేనా!

- ముగిసిన 25 శాతం సబ్సిడీ గడువు
- ఫీజు చెల్లించిన 1,918 ప్లాట్ల దరఖాస్తుదారులు
- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి రూ.8.70 కోట్ల ఆదాయం



చివరిరోజు ఎల్ఆర్ఎస్ చెల్లింపునకు వచ్చిన దరఖాస్తుదారులు

ఇబ్రహీంపట్నం: అక్రమ లే అవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)కు 25 శాతం రాయితీతో ప్రభుత్వం ఇచ్చిన గడువు సోమవారంతో ముగిసింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల నుంచి ఫీజుల రూపేణ ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి రూ.8.70 కోట్ల ఆదాయం సమకూరింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 14,053 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులుండగా సోమవారం నాటికి 1,918 దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించారు.

ఆరంభంలో ఇబ్బంది

ఎల్ఆర్ఎస్ ఫీజుల చెల్లింపు అంశాలపై మొదట్లో అవగాహన లేకపోవడం, సాంకేతిక లోపాల కారణంగా మొదటి మూడు వారాల్లో దరఖాస్తుదారులు ముందుకు రాలేదు. గడిచిన వారం రోజులగా ఫీజులు చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. వేలాది రూపాయల ఫీజులు, తక్కువ సమయం ఉండటం వలన చెల్లింపుదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఫీజులు చెల్లించాలా వద్దా..? ఇప్పుడు అవసరమా అనే మీమాంసలో పడ్డారు. ఇప్పటికే ఆయా ప్లాట్లు రెండుమూడు చేతులు మారడం ఎల్ఆర్ఎస్ చెల్లింపులు మందకొడిగా సాగేందుకు ఓ కారణం. 25 శాతం ఫీజు రాయితీతో ఎల్ఆర్ఎస్ గడువును పెంపుపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

తిట్టాడని చంపేశాడు..

- ఫైనాన్స్ వ్యాపారి దారుణ హత్య
- సహజీవనం చేస్తున్న మహిళ కుమారుడి ఘాతుకం



వెంకటేశ్వర్లు (ఫైల్)


చైతన్యపురి: తిట్టాడని డైలీ ఫైనాన్స్ వ్యాపారిని అతడితో సహజీవనం చేస్తున్న మహిళ కుమారుడు దారుణంగా హత్య చేసిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..రంగారెడ్డి జిల్లా, పులిమామిడి గ్రామానికి చెందిన బచ్చు వెంకటేశ్వర్లు అలియాస్ రాజు (47) గత కొన్నాళ్లుగా కర్మన్‌ఘాట్‌లోని జానకీ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్నాడు. అతడి భార్య విడిపోవటంతో ఒక్కడే ఉంటూ డైలీ ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. సూర్యాపేట జిల్లా శ్రీనివాసపురం గ్రామానికి చెందిన మామిడి గురవమ్మ భర్త మృతి చెందటంతో కుమారుడు పవన్, కుమార్తెతో కలిసి అదే ప్రాంతంలో నివాసం ఉంటోంది. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు, గురవమ్మలకు పరిచయం ఏర్పడింది. గురవమ్మ కుమారుడు, కుమార్తె మరో ఇంట్లో ఉంటుండగా ఆమె వెంకటేశ్వర్లుతో సహజీవనం చేస్తోంది. గత కొద్ది రోజులుగా వెంకటేశ్వర్లు గురవమ్మ ఆమె కొడుకు, కుమార్తెను దూషిస్తున్నాడు. ఆదివారం ఉగాది పండుగ నేపథ్యంలో గురవమ్మ తన కుమారుడు, కుమార్తెను ఇంటికి పిలిచింది. రాత్రి వెంకటేశ్వర్లు, గురవమ్మ, పవన్‌ల మధ్య గొడవ జరగడంతో పవన్ కత్తితో వెంకటేశ్వర్లుపై దాడి చేశాడు. అనంతరం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేశ్వర్లును చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. హత్యకు పాల్పడిన పవన్ పరారీలో ఉన్నాడని, మృతుడి మేనల్లుడి ఫిర్యాదు మేరకు గురవమ్మతో పాటు ఆమె కుమారుడు పవన్, కుమార్తెలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మహిళా రియల్టర్ అరెస్ట్

బంజారాహిల్స్: డిజిటల్ అరెస్టు పేరుతో మోసానికి పాల్పడిన కేసులో ఓ మహిళా రియల్ ఎస్టేట్ వ్యాపారిని సైబరాబాద్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..నగరానికి చెందిన ఓ బాధిరాలికి ముంబై బ్రాందాలోని కుర్లా పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నామని, మీ పేరున ఉన్న ఐసీఐసీఐ బ్యాంక్ ఖాతాలో అక్రమ లావాదేవీలు జరిగాయని, దీనిపై విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. ఇందుకోసం స్కైప్ కాల్ చేసిన అవతలి వ్యక్తి మనీలాండరింగ్ లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో మీరు పాల్గొన్నారో లేదో నిర్ధారించుకుని, క్లియరెన్స్ సర్టిఫికెట్ అందజేస్తామని, ఇందుకోసం మీరు రూ.3,57,998 పంపించాలని, తిరిగి ఆ మొత్తాన్ని 24 గంటల్లోపు పంపిస్తామని నమ్మబలికారు. దీంతో బాధితుడు తన ఖాతాలో అంత మొత్తం లేకపోయినా రుణం తీసుకుని ఆ మొత్తాన్ని నిందితుడి ఖాతాకు బదిలీ చేశాడు. తాను ట్రాన్స్‌ఫర్ చేసిన నగదు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితులను గుర్తించారు. గుంటూరు కాటవరానికి చెందిన ఫిజియోథెరపిస్ట్ తోట శ్రీనివాసరావు, జీవన్‌కుమార్, రఘువీర్‌లను గత నెల 25న అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న మహిళా రియల్ ఎస్టేట్ వ్యాపారి కొంపల్లికి చెందిన క్రోతపల్లి రితికను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు, టెలిగ్రామ్, వాట్సప్ కాల్స్ ఆధారంగా మోసాలకు పాల్పడుతున్నట్లు తెలినారు. వారి నుంచి మూడు సెల్ ఫోన్లు, వివిధ బ్యాంకులకు చెందిన 9 చెక్కు బుక్‌లు, 3 పాస్‌బుక్‌లు, రెండు స్టాంపులు, ఒక క్యూఆర్ కోడ్ స్కానర్, మూడు ఏటీఎం కార్డులు, 5 సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును సైబర్‌క్రైమ్ యూనిట్‌కు చెందిన ఎస్ఐ మన్మోహన్, హెడ్‌కానిస్టేబుల్ ఫిరోజ్, కానిస్టేబుల్ రాకేష్, మహిళా కానిస్టేబుల్ కుమ్‌భారవి బృందం దర్యాప్తు చేస్తుంది.

డీజిల్ లీకై రేంజ్ రోవర్ కారు దగ్ధం

కారులో నుంచి సురక్షితంగా బయటపడిన యువకులు



దగ్ధమవుతున్న కారు

నార్కట్‌పల్లి : రేంజ్ రోవర్ కారు డీజిల్ ట్యాంకు లీకేజీ కావడంతో మంటలు ఎగిసి పడి కారు దగ్ధమైంది. ఈ ఘటన సోమవారం నార్కట్‌పల్లి– అద్దంకి హైవేపై నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు వద్ద జరిగింది. హైదరాబాద్‌కు చెందిన శివప్రసాద్, శివకుమార్, గోవర్ధన్ ముగ్గురు స్నేహితులు కలిసి గుంటూరులో ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. సోమవారం అద్దంకి వద్ద పెట్రోల్ బంక్‌లో రేంజ్ రోవర్ కారుకు పెట్రోల్ పోయించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. చెర్వుగట్టు సమీపంలోకి రాగానే కారు డీజిల్ ట్యాంక్ లీకై చిన్నచిన్న మంటలు రావడాన్ని గుర్తించిన వారు కారును రోడ్డు పక్కన నిలిపి బయటకు వచ్చారు. వెంటనే అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు చాలా వరకు కాలిపోయింది. నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

- ఉక్కపోత భరించలేక మిద్దెపై నిద్రించిన కుటుంబం
- ఇంట్లోకి చొరబడి బంగారం, వెండి, నగదు దోచుకెళ్లిన దుండగులు

పరిగి: వేసవి తాపానికి తట్టుకోలేక ఇంటికి తాళం వేసిన ఓ కుటుంబం మేడపై పడుకోగా.. దొంగలు ఇల్లు గుల్ల చేసిన ఘటన హన్మగండితండాలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మూడావత్ శ్రీను ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబం మొత్తం మిద్దెపై పడుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి తొమ్మిది తులాల బంగారం, అర కిలో వెండి, రూ.60 వేల నగదును దొంగలించుకుపోయారు. ఉదయం లేచి చూడగా ఇల్లు, బీరువా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సంతోష్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.7 వేలు చెల్లించాల్సిందే

- వస్త్ర దుకాణం యజమానికి రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశం
- 45 రోజుల్లో పరిహారం చెల్లించాలి
- లేదా మరో రూ.3 వేలు చెల్లించాల్సి ఉంటుంది

సిటీ కోర్టులు : నాణ్యతలేని దుస్తులు విక్రయించి బాధితురాలిని ఇబ్బందులకు గురి చేసిన వస్త్ర దుకాణం యజమానిపై రంగారెడ్డి జిల్లా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎంతో నాణ్యమైనవని నమ్మించి విక్రయించిన దుస్తులు ఒక్కరోజులోనే పాడైపోవడంతో రిటన్ తీసుకునేందుకు నిరాకరించడం షాప్ నిర్వాహకుల నిర్లక్ష్యమేనని స్పష్టం చేసింది. నాసిరకం దుస్తులు విక్రయించినందుకు వాటి ధర రూ.2900 తోపాటు మానసికంగా ఇబ్బందులకు గురిచేసినందుకు రూ.2000 కోర్టు ఖర్చుల కింద మరోరూ.5000 వేలు వెంటనే చెల్లించాలని షాప్ యాజమన్యాన్ని ఆదేశించింది. ఈ మొత్తాన్ని 45 రోజుల్లోపు బాధితురాలికి చెల్లించాలని లేని పక్షంలో మరో రూ.3000 కలిపి ఇవ్వాల్సి ఉంటుందని ఆదేశిస్తూ ఇటీవల రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు సిహెచ్ లతాకుమారి, సభ్యులు పారుపల్లి జవహర్ బాబు, శ్యామలతో కూడిన బెంచ్ తీర్పును ఇచ్చింది.

కేసు వివరాలిలీ..

సికింద్రాబాద్‌కు చెందిన వనజ గత ఏడాది నాచారంలోని మహావీర్ హోజియరీ ఎక్స్‌ఎల్‌యూ దుకాణంలో రూ.2900 పెట్టి ఓ డ్రెస్ కొనుగోలు చేసింది. ఆ సమయంలో షాప్ యజమాని ఇది చాలా నాణ్యతతో కూడిన వస్తువు అని చెప్పడంతో ఆమె రూ.2900 చెల్లించి డ్రెస్‌ను కొనుగోలు చేసింది. మర్నాడు రోజు డ్రెస్ వేసుకోగా చినిగిపోయింది. దీంతో ఆమె తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని లేని పక్షంలో వేరే డ్రెస్ ఇవ్వాలని షాప్ నిర్వాహకులను కోరింది. దీంతో షాప్ యజమాని ఉద్దేశపూర్వకంగా మీరే డ్రెస్ పాడు చేసుకున్నారని, తాము తిరిగి ఇచ్చేది లేదని చెప్పాడు. దీంతో బాధితురాలు రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించింది. బాధితురాలు దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన కమిషన్ షాప్ నిర్వాహకులను పై విధంగా ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

బస్సును ఓవర్‌టేక్ చేయబోయి..

- ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టిన కారు
- భర్త మృతి, భార్య, ఇద్దరు పిల్లలకు తీవ్రగాయాలు..



భార్య, పిల్లలతో పుల్లారావు(ఫైల్)



ప్రమాదానికి కారణమైన కారు, వాహనం కింద పుల్లారావు మృతదేహం

కుషాయిగూడ: బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపు తప్పిన ఇన్నోవా వాహనం ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో భర్త మృతి చెందగా, భార్య, ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంటూరుకు చెందిన కొండేపాటి పుల్లారావు నగరానికి వచ్చి బీఎన్‌రెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం అతను భార్య పిల్లలతో కలిసి బైక్‌పై ఈసీనగర్ నుంచి పెద్ద చర్లపల్లి వైపుగా వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఇన్నోవా వాహనం బస్సును ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో పుల్లారావు (32) అక్కడిక్కడే మృతి చెందగా, అతడి భార్య నాగరాణి, కుమారులు రుత్విక్, రాజేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. వారు ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. ఇన్నోవా డ్రైవర్ అజాగ్రత్త కారణంగా ఈ ప్రమాదం జరిగిందన్నారు.